

కొమరాడ సర్పంచ్ చెక్ పవర్ రద్దు

కొమరాడ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కొమరాడ పంచాయతీలో నిధుల దుర్వినియోగం అంశంలో ఇటీవల నలుగురు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సర్పచ్ సిరికి గంగమ్మ చెక్ పవర్‌ను రద్దు చేసినట్టు ఎంపీడీవో ఎస్.రమేష్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆదేశాలు అందాయని వెల్లడించారు. నిధుల దుర్వినియోగంపై డీపీవో విచారణ చేపట్టగా.. కలెక్టర్ ఆదేశాలతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేసి నట్లు చెప్పారు. కాగా ఉత్తర్వుల కాపీని సర్పంచ్ నివాసానికి చేరువేయగా ఇంటికి తాళం వేసి ఉం దన్నారు. మరుసటి రోజు వాటిని అందజేస్తామన్నారు.



సీతంపేటలో మూతపడిన వీడీవీకే

ఇలాగే వదిలేస్తారా?

- వీడీవీకేల పరిస్థితి దయనీయం
- పర్యవేక్షణ కరువు
- పాడైపోయిన యంత్రాలు
- భారమైన నిర్వహణ
- మూతపడే స్థితికి కేంద్రాలు

సీతంపేట రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో వన్‌ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకే) పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడికక్కడ ఈ కేంద్రాలు మూతపడే స్థితికి చేరుతున్నాయి. మరోవైపు యంత్ర పరికరాలు కూడా మరమ్మతులకు గురై మూలకు చేరాయి. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి.. గిరిజన మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2011లో రూ.కోట్ల వ్యయంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను ఎస్‌హెచ్‌జీ(సెల్ఫ్ ఎంప్లాయి గ్రూప్స్)లకు, వెలుగు సంస్థకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అయితే ప్రస్తుతం వాటి పనితీరు ప్రభుత్వ లక్ష్యాలకు దూరంగా ఉంది. ఎస్‌హెచ్‌జీల నుంచి ఉన్న డిమాండ్ మేరకు యంత్రాలు సమకూర్చక పోవడం, గతంలో ఇచ్చిన యంత్ర పరికరాలను బాగు చేయకపోవడంతో వీడీవీకేల పరిస్థితి అధ్వానంగా మారింది.

ఇదీ పరిస్థితి..

- సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20 ట్రైబల్ సబ్‌ప్లాన్(టీఎస్‌పీ)మండలాల్లో 121వీడీవీకేలు ఉన్నాయి. ఇక సీతంపేట మండలంలో 35వరకు ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. నిర్వహణ భారంతో అధికశాతం వీడీవీకేలు తెరుచుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో చేసేది లేక ఎస్‌హెచ్‌జీ సభ్యులు కూడా వీటిపై ఆసక్తి చూపడం లేదు.
- కొన్ని కేంద్రాలకు జీడిపిక్కలు ప్రోసెసింగ్ చేసే యంత్రాలు, మరికొన్నింటికి బ్రూమ్ స్టిక్స్ (కొండచీపుర్లు)



జక్కరవలసలో నిరుపయోగంగా ఉన్న కొండచీపుర్లు కటింగ్ మిషన్

కటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. అయితే ఈ యంత్రాలు సక్రమంగా పనిచేయకపోవడం, సభ్యులకు వాటి వినియోగంపై అవగాహన లేకపోవడంతో చాలా కేంద్రాల్లో ఇవి మూలనపడ్డాయి.

- సీతంపేట ఐటీడీఏకు సమీపంలో ఉన్న వీడీవీకేకు 2021లో జీడిపప్పు ప్రోసెసింగ్ యూనిట్, చింతపండు కేక్ తయారీ, పసుపు శుద్ధిచేసి ప్యాకింగ్ చేసే యంత్రాలను అందజేశారు. అయితే అవి కూడా నిరుపయోగంగానే మారాయి. అగరబత్తీల యూనిట్ మాత్రమే ఇక్కడ నడుస్తోంది. ఐటీడీఏకు సమీపంలో ఉన్న వీడీవీకే పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఇంకెలా ఉంటుందో ఐటీడీఏ, వెలుగు అధికారులకే తెలియాలి.
- ఈ ఏడాది ఐటీడీఏ ద్వారా వీడీవీకేలకు అందజేసిన పిండిమిల్లులు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఇక మెళియాపుట్టిలో వీడీవీకే పరిస్థితి దయనీయంగానే ఉంది. యంత్ర పరికరాలు మరమ్మతులకు గురై ఆరు బయట దర్శనమిస్తున్నాయి.
- ఐటీడీఏ పరిధిలో

(మిగతా 8వ పేజీలో...)

డీపీఎం ఏమన్నారంటే..

'వీడీవీకేల నిర్వహణ బాగానే ఉంది. అక్కడక్కడా యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయిస్తాం. వీడీవీకేల్లో మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం.' అని వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణ తెలిపారు.



మరమ్మతులకు గురైన జీడిపిక్కల బాయిలింగ్ యంత్రం

స్టాక్ రికార్డు లేదు..

బిల్లులు లేవు!

- ఎరువుల దుకాణం తనిఖీలో బహిర్గతం
- అమ్మకాలు నిలిపివేయాలని ఏడీఏల ఆదేశం



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏలు

పాలకొండ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎరువుల (శ్రీసాయి రైతు డిపో) దుకాణాన్ని సాలూరు, పాలకొండ ఏడీఏలు జి.సత్యవతి, రత్నకుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో లైసెన్స్ ఒకటే ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన స్టాక్, బిల్లు పుస్తకాలు చూపించకపోవడంపై ఎరువుల దుకాణంలో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎరువుల ధరలు కూడా బోర్డు రూపంలో లేకపోవడం, ఈపోస్ మిషన్ ద్వారా రిపోర్టును చూపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం దుకాణంలో ఉన్న ఎరు వులు, పురుగు మందులను పరిశీలించారు. గోడౌన్‌కు వెళ్లి నిల్వ ఉన్న ఎరువుల వివరాలు సేకరిం చారు. స్టాక్ రికార్డు, బిల్ పుస్తకాలను తీసుకురావాలని షాపు నిర్వాహకులను ఆదేశించారు.

గిరిజనుల జీవనోపాధికి చర్యలు

- సెంట్రల్ నోడల్ అధికారి సుజాతశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ నోడల్ అధికారి సుజాతశర్మ

సీతంపేట రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): గిరిజనుల జీవనోపాధి మెరుగుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర నోడల్ అధికారి డా.సుజాతశర్మ ఆదేశించారు. ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా సీతంపేట ఏజెన్సీలో బుధవారం పర్యటించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తొలుత ఐటీడీఏ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచిం చారు. అటవీ ఉత్పత్తుల దిగుబడి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలు గిరిజన రైతులకు తెలియజేయాలని, పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవమయ్యేలా చూడాలన్నారు. మలేరియా, డెంగ్యూ , సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పీహెచ్‌సీలు 24గంటలు పనిచేసేలా చూడాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లు వినియోగంలో ఉండాలని, మరుగుదొడ్లు కూడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. వీడీవీకేల ద్వారా జీడిపంటను ప్రోసెసింగ్ చేయాలని సూచించారు. ఆ తర్వాత ఆమె మెట్టుగూడ జలపాతాన్ని పరిశీలించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య, సిబ్బంది వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జలపాతం వద్ద కలెక్టర్ ప్రభాకరరెడ్డితో కలిసి ఫొటోలు దిగారు.

కేంద్ర పథకాలు అందుతున్నాయా?

భామిని: కేంద్ర పథకాలు అందుతున్నాయా? లేదా అని సెంట్రల్ నోడల్ అధికారి సుజాతశర్మ ఆదర్శ గ్రామం మనుమకొండలో గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్‌మన్, పీఎం కిసాన్, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలపై

(మిగతా 8వ పేజీలో...)

సర్వేపై నిర్లక్ష్యం వద్దు

- గృహ నిర్మాణశాఖ ఈఈ సోమేశ్వరరావు

గరుగుబిల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టే గృహ నిర్మాణాల సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హౌసింగ్ ఈఈ జి.సోమేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. పీఎంఏవై గ్రామీణ ఆవాస్ ప్లస్ సర్వే కోసం 34 బృందాలను నియమించామని వెల్లడించారు. ఈ నెల 29లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో గృహ నిర్మాణం చేపట్టని వారిని , ఇంటి స్థలం ఉన్నా, లేకపోయినా లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సర్వేలో నమోదు కాకుంటే ఇళ్ల మంజూరుకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని 15 మండలాల్లో 23,344 మందిని గుర్తించామని, 16,237 మంది వివరాలు సేకరణ పూర్తయిందని చెప్పారు. మరో 7,107 మందికి సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. గతంలో నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల ఖాతాల్లో రూపాయి జమ అయిన వారి వివరాలను పరిశీలిస్తున్నా మన్నారు. క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించి తగు నివేదికలు అందించాల న్నారు. ఈ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏఈ వి.అఖిల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో అదరగొట్టారు

- ప్రజాప్రతినిధులుగా హాజరైన మన్యం విద్యార్థులు
- ప్రసంగాలతో ఆకట్టుకున్న వైనం
- సీఎం, మంత్రులతో ప్రత్యేక ఫొటో సెషన్

పాలకొండ, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మన్యం విద్యార్థులు అదరగొట్టారు. తమ ప్రసంగాలతో అందర్నీ ఆకట్టుకున్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ మాక్ అసెంబ్లీలో సీఎంగా జిల్లాకు చెందిన ఎం.లీలాగౌతమ్, ప్రధాన ప్రతిపక్ష నేతగా సౌమ్య వ్యవహరించారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణ అందరినీ ఆకట్టుకుంది. ఒకరిపై ఒకరు ప్రశ్నల వర్షం కురిపించి.. సమాధానాలు రాబట్టుకునే తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి 175 మంది విద్యార్థులు మాక్ అసెంబ్లీకి హాజరయ్యారు. వీరంతా ప్రజాప్రతినిధుల పాత్రలను చక్కగా పోషించారు. పాలకొండ మండలం ఎం.సింగుపురం జడ్పీ హెచ్ ఎస్‌కు చెందిన నిహారిక ప్రతిపక్ష ఎమ్మెల్యే పాత్ర పోషించగా, గరుగుబిల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి దాసరి దినేష్ రూలింగ్ పార్టీ ఎమ్మెల్యేగా వ్యవహరించారు. బలిజిపేట కేజీబీవీ విద్యార్థిని దువ్వ జయంతి హోం మినిస్టర్ హోదాలో మెరిశారు. ఇలా మన్యం విద్యార్థులు మాక్ అసెంబ్లీలో తమదైన శైలిలో ప్రతిభ చూపారు. ' మాక్ అసెంబ్లీకి హాజరవడం మరిచిపోలేని అనుభూతి. భారత రాజ్యాంగంపై మరింత గౌరవం పెరిగింది. రాజ్యాంగం విలువలు, ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధుల బాధ్యతలు తెలుసుకున్నాం. భవిష్యత్‌లో ప్రజలకు మా వంతు సేవలందిస్తాం.' అని పలువురు విద్యార్థులు తెలిపారు.




అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా హాజరైన దినేష్, నిహారిక

వాడీవేడిగా చర్చ...

మాక్ అసెంబ్లీలో పర్యావరణ పరిరక్షణ బిల్లు, క్రీడలపై విద్యార్థుల మధ్య వాడీవేడిగా చర్చ కొనసాగింది. ఒక దశలో ప్రతిపక్ష హోదాలో ఉన్నవారు స్పీకర్ పొడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఈ సమయంలో కొందరిని మార్షల్స్ ఎత్తుకొని అసెంబ్లీ హాల్ నుంచి బయటకు తీసు కెళ్లారు. అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలు పోలినట్టే ఈ కార్యక్రమం అంతా జరిగింది. శాసనసభలో కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రవర్తించే తీరును కళ్లకు కట్టినట్టు చూపించారు. అనంతరం సీఎం, మంత్రులతో విద్యార్థులకు ప్రత్యేక ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా నుంచి మాక్ అసెంబ్లీకి హాజరైన విద్యార్థులతో ఉన్న టీచర్లు పి.శ్రీరాంసాయి, ఎస్.సుబ్బలక్ష్మిని డీఈవో రాజ్‌కుమార్, ఏవో జోగినాయుడుతో అభినందించారు.



స్పీకర్ పోడియం వద్ద ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతగా జిల్లా విద్యార్థులు లీలాగౌతం, సౌమ్యసాయి

గుర్తిస్తారా.. ఆదుకుంటారా?

- గిరి శిఖర గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్థులు
- దయనీయ స్థితిలో జీవనం
- అందని వైద్య సేవలు, సంక్షేమ పథకాలు
- ప్రతినెలా ఆసుపత్రులకు చేరుకునేందుకు అవస్థలు
- సాయం కోసం ఎదురుచూపు

కురుపాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల్లోని పలు పంచాయతీల్లో కుష్ఠు వ్యాధిగ్రస్థుల పరిస్థితి దయనీయంగా మారింది. వారికి ఎటువంటి వైద్య సేవలు, సంక్షేమ పథకాలు అందడం లేదు. దీంతో తోటి గిరిజనుల సాయంతోనే కాలం నెట్టుకొస్తున్నారు. తిత్తిరి పంచాయతీలో ఎగువ ఆవిరి, గూనిగూడ, ఎగువ కీడవాయి, కాగుమానుగూడ, పొడి పంచాతీయ భారతంగి తదితర గిరి శిఖర గ్రామాల్లో అధికంగానే వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వారంతా గ్రామాలకు దూరంగా ఉంటున్నారు. సొంత ఖర్చులతోనే విజయనగరం, పార్వతీపురం, కురుపాం, నీలకంఠా పురం ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. అయితే ప్రతినెలా వ్యయ ప్రయాసలకు గురై ఆసుపత్రులకు చేరుకోవాల్సి వస్తోంది. కనీసం డ్రెస్సింగ్ చేసుకునేందుకు అవసరమైన మందులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రోజురోజుకూ వ్యాధి ముదురడంతో

(మిగతా 8వ పేజీలో...)



ఎగువ కీడవాయిలో బాధితుల గుర్తింపు సర్వే చేపడుతున్న నీలకంఠాపురం వైద్యసిబ్బంది

నగర పంచాయతీ వీధుల్లోకి

తోటపల్లి నీరు

- కాలనీ వాసులకు తప్పని అవస్థలు

పాలకొండ, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నీరు బుధవారం నగర పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లోకి చేరింది. దీంతో నీలమ్మకాలనీ, టీచర్స్ కాలనీ, సీఎల్‌నాయుడు నగర్, ఆదిత్యనగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాస్తవంగా తోటపల్లి ఎడమ కాలువ ద్వారా వడమ పంట పొలాలకు నీరు అందాల్సి ఉంది. అయితే కాలువలు ఆక్రమణలకు గురవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పట్టణంలోని వీధులు, రహదారులపై ఆ నీరు చేరుతుండడంతో ఆయా కాలనీవాసులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇదిలా ఉండగా ప్రస్తుతం అన్నదాతలు ఖరీఫ్ వరి కోత పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొంతమంది మినుము, పెసర సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో తోటపల్లి ప్రధాన కాలువ ద్వారా నీరు విడుదల చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



సచివాలయం వార్డు వీధిలో పరిస్థితి ఇదీ..



నీలమ్మకాలనీలో ఇలా..

స్వాములూ.. జాగ్రత్త



ప్రయాణానికి సిద్ధంగా అయ్యప్పస్వాములు



- ఉమ్మడి జిల్లాలో ముగిసిన మండల దీక్ష
- శబరిమలకు పయనమవుతున్న అయ్యప్ప భక్తులు
- ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలంటున్న ప్రభుత్వాలు

రాజాం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములూ బహుపరాక్..' అంటోంది కేరళ ప్రభుత్వం. కొన్ని కారణాల దృష్ట్యా అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే కేరళ వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. ప్రస్తుతం అక్కడి పరిస్థితులపై ప్రసార సాధనాలతో పాటు సోషల్ మీడియా ద్వారా అయ్యప్ప భక్తులకు చేరేలా కేరళ, రెండు తెలుగు రాష్ట్రాలు ప్రచారం చేస్తున్నాయి. జ్వరం, తలనొప్పి, ఒళ్లనొప్పులు ఎక్కువగా వస్తున్నాయని అక్కడి వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వందలాదిమంది అయ్యప్ప స్వాములు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

● ఉమ్మడి జిల్లాలలో..

రెండు జిల్లాలలో దాదాపుగా మండల దీక్షలు పూర్తి కావచ్చాయి. అక్టోబరులో దీక్షలు ప్రారంభించిన అయ్యప్ప భక్తులు ఈ నెల 20 నుంచి 24 మధ్యలో ఇరుముడి కార్యక్రమాలు పూర్తి చేసుకుని శబరిమలకు పయనమయ్యారు. రెండు జిల్లాలలో సుమారు ఇరవై వేలకు పైగా భక్తులు అయ్యప్ప దీక్షలు చేపట్టారు. వీరంతా ప్రయాణాల్లో ఉన్నారు. మరికొందరు ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలో కేరళ ప్రభుత్వ ప్రకటనలు అయ్యప్ప భక్తులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రయాణంతో పాటు ఎరుమేళి, నీలక్కల్, పంబానదిలో స్నానం చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కేరళ ప్రభుత్వంతో పాటు ఎక్కడికక్కడ వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యుల సూచనలివిగో..

- పంబానదిలో స్నానం చేసినపుడు ముక్కు, చెవిలోకి నీరు చేరకుండా జాగ్రత్తపడాలి.
- పంబలో జగ్గులతో తలస్నానం చేయడం మంచిదని చెబుతున్నారు.
- వీలైనంత వరకూ పంబానది వరకూ కాకుండా ఎరుమేళి, నీలక్కళ్ ప్రాంతంలో స్నానాలు పూర్తిచేసుకుని అయ్యప్ప కొండకు పయనమైతే మేలు.
- బహిరంగంగా మల, మూత్రవిసర్జన సరికాదని స్పష్టం చేస్తున్నారు. టాయిలెట్స్‌ను వినియోగించాలి. వ్యర్థాలను చెత్తబుట్టల్లో మాత్రమే వేయాలి.
- శబరిమల ప్రాంతంలో సరఫరా చేస్తున్న కాచి.. చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. వేడివేడిగా ఉన్న ఆహారపదార్థాలు తినేందుకు ప్రాధాన్యమివ్వాలి.
- బయట ఉంచిన లేదా సరిగ్గా శుభ్రం చేయని పండ్లను తినకూడదు. ఒకవేళ పండ్లు తినాల్సివస్తే బాగా కడగడం తప్పనిసరి.
- ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా జ్వరం, జలుబు, ఒళ్లనొప్పులు, గ్యాస్ట్రిక్, సుగర్, బీపీలతో బాధపడుతున్న స్వాములు ఆమేరకు అవసరమైన మాత్రలు తమవెంట తీసుకువెళ్లాలి.
- వీలైనన్ని ఎక్కువ మాస్కులు తమతో తీసుకువెళితే మంచిది.

ఏయూ దూరవిద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- కొత్తవలస ప్రగతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అక్రమాలు
- ఒక్కో విద్యార్థి నుంచి నాలుగు వేల నుంచి పది వేల రూపాయల వరకూ వసూలు
- ముందుగానే విద్యార్థుల చేతికి ప్రశ్నపత్రం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విద్యార్థుల చిట్‌చాట్
- స్క్వాడ్‌ను పంపించామన్న డైరెక్టర్

విశాఖపట్నం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. తమ వద్ద పరీక్షలు రాస్తున్న విద్యార్థుల నుంచి కొన్ని కాలేజీల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేసి, ప్రశ్నపత్రాన్ని ముందుగానే లీక్ చేస్తున్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఈ విధంగా వ్యవహరించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో విద్యార్థి నుంచి నాలుగు వేలు నుంచి పది వేల రూపాయల వరకూ వసూలు చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి కొందరు విద్యార్థులు ప్రగతి కాలేజీ పరీక్షా కేంద్రం ఎదురుగా ఉన్న జెరాక్స్ సెంటర్ వద్ద మాట్లాడుకుంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పరీక్షకు నాలుగు వేల రూపాయలు చెల్లించినట్టు ఒక అభ్యర్థి చెప్పగా, ఎవరి ద్వారా ఫీజు చెల్లించారో ఆ వీడియోలో విద్యార్థులు చర్చించుకుంటూ కనిపించారు. ఈ వీడియో బయటకు రావడంతో మరోసారి దూరవిద్య పరీక్షల నిర్వహణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ తరహా మాస్‌కాపీయింగ్‌కు సహకరించిన కాలేజీలపై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

ప్రత్యేక ఏర్పాట్లు..

ఏయూ దూరవిద్య కేంద్రం బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించి మొదటి, రెండు, మూడో సెమిస్టర్‌ల తోపాటు 2019 నుంచి గత విద్యా సంవత్సరం వరకూ ఉన్న బ్యాక్‌లాగ్స్‌కు ఈ నెల 25 నుంచి పరీక్షలు నిర్వహిస్తోంది. ఇటు శ్రీకాకుళం నుంచి అటు గుంతకల్లు వరకూ 78 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు పది వేల మందికిపైగా హాజరవుతున్నారు. అయితే పరీక్ష కేంద్రాలుగా ఉన్న కొన్ని కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నాయి. కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ నిర్వాహకులు డబ్బులు చెల్లించిన విద్యార్థులకు మాత్రమే ప్రశ్నపత్రాలను పంపినట్టు తెలిసింది. అదే విధంగా వారందరినీ ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చోబెట్టి పరీక్షలు రాయించినట్టు చెబుతున్నారు. విద్యార్థులు ఆయా ప్రశ్నలకు సమాధానాలు రాసిన వెంటనే మైక్రో జెరాక్స్‌లను అక్కడ నుంచి తీసుకువెళ్లేలా ఆయాలను ఏర్పాటుచేసినట్టు తెలిసింది. పరీక్ష ప్రారంభమైన గంట మాత్రం జాగ్రత్తగా ఉండాలని, ఆ తరువాత మైక్రోజెరాక్స్‌లు తీసుకుని రాసుకోవాలని చెప్పినట్టు చెబుతున్నారు. ఇకపోతే, ఇదే కాలేజీకి చెందిన బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులకు సంబంధించి కూడా సెల్ఫ్ సెంటర్‌ను వేయించుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. దూరవిద్యకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఏరోజుకారోజు కాస్త ముందు పంపినట్టయితే అక్రమాలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీనిపై దూరవిద్య డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే స్క్వాడ్‌ను పంపించామని, పలువురు విద్యార్థులు స్లిప్పులతో దొరికారని చెప్పారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వారి ఆదేశాల మేరకు సెంటర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

లౌకిక వాదానికి ప్రతీక మన రాజ్యాంగం

● ఎస్పీ దామోదర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): లౌకికవాదానికి ప్రతీకంగా భారత రాజ్యాంగం ఏర్పడిందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.. భారతరత్న డాక్టరు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిన్న సంస్కృతులు గల వ్యక్తులను, మతాలను ఒక తాటిపై నడిపించిన ఘనత భారత రాజ్యాంగానిదేనన్నారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తామని, శాంతి యుత మార్గాల ద్వారా ప్రతి వివాదాన్ని పరిష్కరించుకుంటామని జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, ఏవో శ్రీనివాసరావు, సీఐలు లీలారావు, అంబేడ్కర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కమాండెంట్ రాజారెడ్డి, ఇతర అధికారులు

చింతలవలసలో..

డెంకాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చింతలవలస 5వ బెటాలియన్ ఏపీఎస్పీ యూనిట్ హాల్‌లో కమాండెంట్ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి కమాండెంట్ రాజారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సిద్ధాంతాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జి.లక్ష్మీనారాయణ, డీవీ రమణమూర్తి, ఎస్.బాపూజీ, యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

● జేసీ సేతు మాధవన్

మెరకముడిదాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ అన్నారు. గర్భాం, బుదరాయవలస రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బుదరాయవలసలో జరుగుతున్న 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాలన్నీ రైతులకు వివరించేందుకే సచివాలయ సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. ధాన్యానికి మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ద్వారా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. వీటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్ సులోచనరాణి, వ్యవసాయాధికారి శ్రావణి, సర్వే ప్రత్యేకాధికారి తాడ్డి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్



కొత్తవలస: స్వామికి అలంకరణ



బొబ్బిలి: దాడితల్లి ఆలయంలో దివ్యాలంకరణ..



ఎస్‌కోట: స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



రేగిడి: గోపంపేటలో పూజల కోసం కలశాలతో నీటిని తీసుకెళుతున్న మహిళలు

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి

సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, చేయించారు. కొన్నిచోట్ల సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం చేయించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతకవిటి: సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



రాజాం రూరల్: కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పర్యాటకుల కోసం.. పార్క్ సుందరీకరణ

- ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అధికారులు
- నేడు తోటపల్లి ప్రాజెక్టు ఆవరణలో ఐటీడీఏ పార్కు పునః ప్రారంభం

గరుగుబిల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి మట్టికట్ట ప్రాంతంలో గల పార్వతీపురం ఐటీడీఏ పార్కును ప్రత్యేక ఆకర్షణీకందా అధికారులు తీర్చి దిద్దారు. పర్యాటకుల కోసం పార్క్‌ను సుందరీక రించారు. ఈమేరకు గురువారం పార్కును పునః ప్రారంభించనున్నారు. ఈకార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, కలె క్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌తో పాటు పలువురు అధికా రులు హాజరుకానున్నారు. గత ఐదేళ్లలో మూలకు చేరిన ఐటీడీఏ పార్కును ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కొద్దిరోజులుగా పనులు చేపడుతున్నారు. పార్కు ను ఆనుకుని ఉన్న దుకాణ సముదాయాన్ని ప్రారంభించనున్నారు. పార్కు ప్రాంతాన్ని పర్యాట కులు ఆకర్షించే విధంగా చర్యలు చేపట్టారు. తోట పల్లి ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేం దుకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ప్రత్యేక చొరవ చూపడంతో నూతన శోభ నెలకొంది.



రిజర్వాయర్ వైపు వెళ్లే మార్గాన్ని వెదురుతో ఆకర్షనీయంగా తయారు చేసిన దృశ్యం





ప్రాజెక్టు ప్రాంతాన్ని వీక్షించేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు

నేటి నుంచి శుభ కార్యాలకు బ్రేక్

● శుక్ర మూఢంతో ఆగనున్న వివాహాలు

గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యాలకు గురువారం నుంచి బ్రేక్ పడనుంది. శుక్ర మూఢం నేపథ్యంలో బుధవారం వివాహాలు అధిక సంఖ్యలో జరిగాయి. శుక్ర మూఢం వల్ల 84 రోజులు శుభ కార్యాలు చేయరాదని పండితులు తెలిపారు. గురువారం నుంచి వచ్చేఏడాది ఫిబ్రవరి 17వ తేదీ వరకు శుక్ర మూఢం ఉంటుందని జ్యోతిష్య ప్రవీణ, వాస్తు ఆచార్య, సంఖ్యాశాస్త్ర విశారద, సువర్ణ ఘంటా కంకణధారణ సన్మాన గ్రహీత వేమకోటి సుబ్బలక్ష్మీనరసింహశర్మ తెలిపారు. శుభాలకు అధిపతులైన గురు, శుక్రుడు ఈ మూఢంలో సూర్యుడికి సమీపంగా రావడంతో శక్తిని కోల్పోతారని చెప్పారు. మూఢం రోజుల్లో వివాహాలు, యాత్రలు, పుట్టు వెంట్రుకలు తీయడం, గృహ ప్రవేశాలు, వాహన కొనుగోళ్లు, బోరుబావులు తవ్వించడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని చెప్పారు. నిత్యారాధన, సీమంతాలకు శుక్ర మూఢం వర్తించదని తెలిపారు.

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం


రాజాం రూరల్: మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ



ఎస్.కోట: మాట్లాడుతున్న న్యాయాధికారి కనకలక్ష్మి


బొండపల్లి: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్

రాజాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలోను... ప్రజల మధ్య వివాదాలను పరిష్కరించడంలోను న్యాయవాదుల పాత్ర కీలకమని సీనియర్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికారసంస్థ అధ్యక్షురాలు కె.శారదాంబ స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జూనియర్, సీనియర్ కోర్టుల ప్రాంగణంలో బుధవారం న్యాయవాదులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి నైమిష, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న దురాచారాన్ని అరికట్టండి

శృంగవరపుకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వరకట్న దురాచారాన్ని అరికట్టాలని శృంగవరపుకోట న్యాయాధికారి బి.కనక లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం న్యాయ స్థాన ప్రాంగణంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాదులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కట్నం ఇవ్వడం..తీసుకోవడం నేరమన్నారు.

క్రమశిక్షణే ఉన్నతికి పునాది

బొండపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ అద్దెల విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం ఉమామహేశ్వరరావు అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవం, వరకట్న నిషేధ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ పది మందికి స్ఫూర్తివంతంగా నిలవాలని హితవు పలికారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు మేజిస్ట్రేట్ ఎ.విజయ్‌రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


కొత్తవలస కోర్టులో ప్రమాణం చేస్తున్న న్యాయాధికారి, న్యాయవాదులు


చీపురుపల్లి:పెదనడిపల్లిలో విద్యార్థుల విన్యాసం

కొత్తవలసలో...

కొత్తవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టులో న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయ్ చందర్ న్యాయవాదులు, సిబ్బందితో రాజ్యాంగానికి లోబడి పని చేస్తామని ప్రమాణం చేయించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సీఐ షణ్ముఖరావు సిబ్బందితోను, ఇన్‌చార్జి తహసీల్దార్ సునీత రెవెన్యూ సిబ్బందితోనూ రాజ్యాంగ విలువలను కాపాడతామని ప్రమాణం చేయించారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి డా.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మెట్టపల్లి పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల, పెదనడిపల్లి ఉన్నత పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ ఎస్.రాఘవులు కళాశాల విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు.

పోలీసుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



రామకోటి సతీమణికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ ఎఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, రైలు ప్రమాదంలో మరణించిన బొబ్బిలి రామకోటి కుటుంబానికి స్టేట్ బ్యాంకు పోలీసు శాలరీ ప్యాకేజీ ప్రయోజనంగా మంజూరు చేసిన రూ.కోటి చెక్కును ఆయన సతీమణి సీహెచ్ రమకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ స్టేట్ బ్యాంకు శాలరీ ప్యాకేజీని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీఐ మేనేజర్ ఎం.సురేష్‌బాబు, పి.రఘురామ్, విజయ్ కుమార్, ఒమ్మి వెంకటరావు, ఏవో శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రూ.1100 కోట్ల రుణ లక్ష్యం


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసపాణి

నెల్లిమర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మహిళలకు రూ.1100 కోట్ల రుణాలు అందించి పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసపాణి తెలిపారు. వెలుగు వార్షిక కార్యాచరణ ప్రణాళికపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 10 మండల సమాఖ్యలను, రెండు, మూడు విడతలత్లో 4 చొప్పున సమాఖ్యలను ఆదర్శవంతంగా తయారు చేయడానికి ఎంపిక చేసినట్లు వివరించారు. మహిళల ఆలోచనా విధానంలో మార్పు రావాలన్నారు. ఏపీఎం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెలుగు-డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు కె.సావిత్రి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి, ఏపీఎంలు విశ్వేశ్వరరావు, సురేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సల్ఫర్ వినియోగంలో పరిమితులు అవసరం


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యవాణి

రేగిడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్మాగారాల్లో పరిమితికి మించి సల్ఫర్ వినియోగం, నిల్వ లు ఉండకుండా చూడాలని ఆర్డీవో సత్యవాణి అన్నారు. సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్స్ సల్ఫర్ గొడౌన్‌ల లైసెన్స్ పునరుద్ధరణ కోసం బుధవారం ఆర్డీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణలత పాల్గొన్నారు. దీనిపై జేసీకి నివేదిక అందిస్తానని తెలిపారు. ఆర్డీవో వెంట ఆర్ఐ గిరి, వీఆర్వో దుర్గారావు ఉన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడిగా ధనుంజయ్

నెల్లిమర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లిమర్ల తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా కె.ధనుంజయ్ ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ధనుంజయ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఆర్.సురేష్, కార్యదర్శిగా ఎన్.మోహనరావు, ఉపాధ్యక్షులుగా పి.సూర్యనారాయణరాజు, కె.రామకృష్ణ, జి.ఉమామహేశ్వరరావు, ఎం.నారాయణరావు, వి.చంద్ర, జాయింట్ సెక్రటరీలుగా ఎం.హరిప్రసాద్, ఎం.శ్రీను, ఎం. శ్రీనివాసరావు, అల్లు మాధవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.అశోక్, కోశాధికారిగా సీహెచ్.వాసుదేవరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎం.ఆనంద్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు వ్యవహరించారు.

గిట్టుబాటు ధర పొందడం రైతుల హక్కు

చీపురుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధర పొందడం రైతుల హక్కు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. పెదనడిపల్లిలో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేసి, పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కొనుగోలు కేంద్రాల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి గింజా కొనుగోలు చేసి, రైతుల ఖాతాకు డబ్బులు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు, వైస్ చైర్మన్ వలిరెడ్డి శ్రీరాములునాయుడు, పీఏసీఎస్ చైర్మన్లు అలమండ నరసింహమూర్తి, ఇప్పిలి సురేష్, ఎలకల అప్పారావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన యూనిసెఫ్ ప్రతినిధి

లక్కవరపుకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ బ్రాండ్ అంబాసిడర్ డేవిడ్ బెకహమ్‌తో బృందం బుధవారం సందర్శించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను పరిశీలించారు. విద్యావిధానం, సృజనాత్మకత, ల్యాబ్, లైబ్రరీ తరగతులు, డార్మిటరీ, శానిటేషన్, భోజన, వసతి అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయనతో పాటు ఎంజేపీ బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి పి.మాధవీలత, ప్రిన్సిపాల్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో శ్రామిక వర్గానికి నష్టం


రాజాం: నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు, సభ్యులు


ఎస్.కోట: ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



కొత్తవలస: నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌ల అమలుతో శ్రామిక వర్గానిక తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని కార్మికసంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన లేబర్‌కోడ్‌ల నోటిపై ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని బుధవారం రాజాంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల నిరసన

రాజాం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చీఫ్ మేనేజర్ మాధవీలత, మేనేజర్ జనార్దననాయుడు ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా...కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎం.జితేంద్ర డిమాండ్ చేశారు. రాజాం ఎల్ఐసీ భవనం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు.

లేబర్‌కోడ్‌లను వెనక్కి తీసుకోండి

శృంగవరపుకోట నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకోచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని శృంగవరపుకోట ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియోషన్ (ఎఐఐఈఏ) డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆందోళన చేసారు. వీటిని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం తీవ్రమవుతుందని యూనిట్ కార్యదర్శి జి.రాకేష్ వర్మ హెచ్చరించారు.

ఆ కోడ్‌లను ఉపసంహరించుకోండి

కొత్తవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని కొత్తవలస జ్యూట్‌మిల్లు కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం కొత్తవలసలో కోడ్ పత్రాలను కార్మికులు, నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయు(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు న్యాయం జరగదన్నారు. గతంలో 100 మంది కార్మికులు ఉన్న కర్మాగారం మూసివేయాలంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరని, కొత్త చట్టం ప్రకారం 300 మంది కార్మికులు ఉంటేనే ప్రభుత్వ అనుమతి అవసరం ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరి ఎంపిక

లక్కవరపుకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చందులూరు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ పి.శ్రీరాములు తెలిపారు. అండర్-14 నెట్‌బాల్‌కు దమ్ము హర్షవర్దన్, అండర్-17 బేస్‌బాల్‌కు సంపర్తి గణేష్‌లు ఎంపికైనట్టు తెలిపారు. వీరు ఈ నెల 27 నుంచి 29 వరకు పశ్చిమ గోదావరి, నంద్యాల జిల్లాల్లో జరిగే పోటీలలో పాల్గొంటారని వివరించారు.

జెడ్పీ పాఠశాలను పరిశీలించిన ఎంఈవో

గంట్యాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గంట్యాడ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి విజయకుమారి బుధవారం పరిశీలించారు. 'గొంతు తడవక...ముద్ద దిగక' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. డీఈవో మాణిక్యం నాయుడు ఆదేశాల మేరకు ఎంఈవో పాఠశాలకు వెళ్లి... పరిస్థితిపై ఆరా తీశారు. మంచి నీటి సమస్యతో పాటు మిగిలిన అన్నాన్ని బయట పారవేయడంపై సిబ్బందిని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఏజెన్సీ సభ్యులతో విడివిడిగా మాట్లాడారు. ఈమేరకు డీఈవోకు నివేదిక అందించనున్నట్టు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘనంగా పాల దినోత్సవం

నెల్లిమర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి, జాతీయ పాల దినోత్సవాన్ని కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రూపవాణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు ఎస్.శివాజీ, ఐకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ జయపాల్‌రావు, అధ్యాపకులు డాక్టర్ బి.శుభ రాఘవ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో అనారోగ్యం వస్తుందా?

ఎస్.కోట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలో జిందాల్ పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో పారిశ్రామిక వాడలు అని ప్రకటన చేయగానే ఇక్కడకు వచ్చిన ఓ ఆశ్రమానికి చెందిన బాబా క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి మంత్రి, ఎమ్మెల్యేలతో శంకుస్థాపన చేయించారు. పరిశ్రమలు పెట్టడం వల్ల ఈ ప్రాంతీయులు అనారోగ్యం బారిన పడతారని ముందుగానే ఊహించారా ?'అంటూ జిందాల్ నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం తమ 166వ రోజు నిరసనలో భాగంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఎలాంటి పరిశ్రమలు వస్తాయో తెలీదన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని నినాదాలు చేశారు. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకోవద్దని కోరారు.

రాజ్యాంగం ఒక వరం

విజయనగరం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మన రాజ్యాంగం దేశ ప్రజలకు ఒక వరమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వే సి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగు అధికారులతో పాటు జడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు స్ఫూర్తిదాయకం

మెరకముడిదాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు స్ఫూర్తిదాయకమైనవని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి, తహసీల్దార్ ఎ.సులోచనరాణి, ఎంపీడీవో జి.భాస్కరరావు, ఏఎస్‌వో సంతోష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పురుగుల మందు తాగి మహిళ మృతి

బొండపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భూదేవిపేట గ్రామానికి చెందిన డోల పూజిత (22) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూజిత తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఇటీవల ప్రమాదానికి గురై మానసికంగా ఇబ్బందులకు గురవుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగువారు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి...

కొత్తవలస, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాపల్లి జంక్షన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్టు ఏఎస్ఐ సూర్యప్రకాశరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం కాకులపాలెం గ్రామానికి చెందిన తూరిబిల్లి రాము(55) భార్య కాంతంతో కలిసి విశాఖపట్టణంలోని గాజువాక ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. రాము స్టీల్‌ప్లాంట్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. ఇటీవల తమ స్వగ్రామానికి వచ్చిన రాము మంగళవారం మధ్యాహ్నం తన స్కూటీపై వెళతుండగా ఉత్తరాపల్లి సమీపంలోని మర్రిచెట్టు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో రాముకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన రామును ముందు శృంగవరపుకోట అక్కడి నుంచి విశాఖపట్టణం చికిత్స నిమిత్తం తరలించారు. విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు భార్య కాంతం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏఎస్ఐ సూర్యప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి దివ్య, ప్రియాంక అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి.

చెట్టుపై నుంచి జారిపడి...

కొమరాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):అల్లువాడ గ్రామంలో ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బిడ్డిక సతీష్ జీలుగుచెట్టు ఎక్కుతుండగా మంగళవారం కాలుజారి పడిపోవడంతో తలకు దెబ్బతగిలింది. దీంతో కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించాలని వైద్యులు శామ్యూల్ జాహో సూచించారు. దీంతో జిల్లా ఆసుపత్రిక తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సతీష్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాజాం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని సారథి రోడ్డులోని ఓ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత సావిత్రి కేసులో నిందితుడు కంఠ మన్మథరావును అరెస్టు చేసి..బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ తెలిపారు. పాలకొండలో సావిత్రికి రుణం ఇప్పిస్తానని నమ్మబలికి, భర్తను, కొడుకుని వదులుకునేలా చేసి... శారీరకంగా, మానసికంగా ఆమెను వేధింపులకు గురిచేశాడని సి.ఐ. అశోక్ తెలిపారు. దీంతో తట్టుకోలేని ఆమె ఈనెల 23న రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈమేరకు న్యాయాధికారి నైమిష నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు అశోక్‌కుమార్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు జైలు

గంట్యాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి.. వాహనాలు నడిపిన ఐదుగురికి ఐదు రోజుల జైలు, మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ విజయనగరం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు) శ్రీవిద్య తీర్పునిచ్చారని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఇటీవల వాహన తనిఖీల్లో వీరంతా పట్టుబడ్డారని ఆయన వెల్లడించారు.

దత్తిరాజేరులో...

దత్తిరాజేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధించినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. బొండపల్లి మండలం గరుడబిల్లికి చెందిన రెడ్డి ధనుంజయరావు మద్యం తాగి వాహనం నడుపుతూ మంగళవారం పట్టుబడ్డారు. ఈమేరకు గజపతినగరం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా 7 రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు


బాడంగిలో...

బాడంగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రూ.10 వేల జరిమానా, మరో ఇద్దరికి మూడు రోజులపాటు జైలు శిక్షను బొబ్బిలి కోర్టు విధించినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపి వారు పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు వారిని బొబ్బిలి సబ్‌జైలుకు తరలించినట్టు తెలిపారు.

రామభద్రపురంలో...

రామభద్రపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఆరికతోట గ్రామానికి చెందిన పి.అచ్చుతరావుకు ఏడు రోజులు, జీలికవలస గ్రామానికి చెందిన పాపారావుకు మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ హర్షవర్దన్ తీర్పు వెల్లడించినట్లు చెప్పారు.

33 మంది బైండోవర్


రేగిడి తహసీల్దార్ ఎదుట హాజరైన బెల్టు షాపుల నిర్వాహకులు

రేగిడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రేగిడి, రాజాం మండలాల్లోని వివిధ గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న 33 మందిపై రాజాం ఎక్సైజ్ శాఖ కొరడా ఝుళిపించింది. ఈ మేరకు బుధ వారం రేగిడి, రాజాం తహసీల్దారుల ఎదుట వీరిని బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ మహేష్ తెలిపారు. బైండోవర్ చేసిన వారిలో రేగిడి నుంచి 16 మంది, రాజాం మండలం నుంచి 17మంది ఉన్నట్లు తెలిపారు.

చదరంగంతో తెలివికి పదును

చీపురుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చదరంగం వల్ల మేధోసంపత్తి పెరుగుతుందని, తార్కిక ఆలోచనలు మెరుగవుతాయని జాతీయ చీఫ్ ఆర్బిటర్ ఏడీఎన్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఓ కళాశాలలో నియోజకవర్గస్థాయి చదరంగం పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదరంగం వల్ల పిల్లల ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మెరుగుపడుతుందన్నారు. ఈ పోటీలకు 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ మీసాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం తాలూకా యూనిట్ ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



బెలగాం: ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్జీవో కార్యవర్గం

బెలగాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో పార్వతీపురం తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఆర్.ఈశ్వరరావు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ ఎస్.ఎస్ ప్రకాశరావు ప్రకటించారు.బుధవారం పార్వతీపురంలోని ఏపీ ఎన్జీవో హోంలో ఎన్నికలు జరిగాయి. 15 వందల మంది ఉద్యోగులుసభ్యులుగా ఉన్న యూనిట్‌లో అధ్యక్షుడిగా సువ్వాడ దుర్గా ప్రసాద్ , సెక్రటరీగా జొన్నాడ విక్టర్, కోశాధికారిగా జి.వినయ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వైవీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.పుష్ప, వైస్ ప్రెసెడెంట్‌గా మధు శంకర్, ఉడమాల వెంకటనాయుడు, ఆర్.రమేష్ 16 పోస్టులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అబ్జర్వర్‌గా పద్మలత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కిషోర్, సంగమేశ్వరరావు, సూర్యనా రాయణ పాల్గొన్నారు.

6న ఎన్‌జీవో కురుపాం తాలూకా యూనిట్ ఎన్నిక

కురుపాం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కురుపాం తాలూకా యూనిట్ ఎన్‌జీవో సంఘ ఎన్నిక డిసెంబరు ఆరో తేదీన కురుపాం పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు యూనియన్ ఎన్నికల అధికారి జె.విక్టర్, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి ఎస్.దుర్గ ప్రసాద్ తెలిపారు. బుధవారం కురుపాంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కురుపాంలో తాలూకా యూనిట్‌లో 510 మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్నారని యూనిట్ అధ్యక్ష కార్యదర్శి తదితర 15 పోస్టులకు ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఈనెల 29వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి ఎంఎం నాయక్ ఆదేశించారు. బుధవారం సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతోపాటు గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో ఏటీడబ్ల్యూవో రజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులఆరోగ్యానికి ప్రాధాన్య ఇవ్వాలన్నారు. వసతిగృహాల్లో మరణాలు సంభవించరాదని సీఎం చంద్రబాబునాయుడు, గిరిజన సంక్షేమ, బీసీ, సాంఘిక సంక్షేమం అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు, తాగునీటి సరఫరా, మినరల్ వాటర్ ప్లాంట్ కొనుగోలుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పచ్చదనం పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

వీరఘట్టం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు తెలిపారు. బుధవారం స్థానికఎంపీడీవో కార్యాలయంలో థీమ్-5 పచ్చదం, పరిశుభ్రతపై శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. బుధవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు ఒక కుటుంబానికి ఒక ఎంటర్‌ప్రైజస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిని పెంపొందించేందుకు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. గ్రామస్థాయిలో జీవనోపాధులు మెరుగుకు ఏ రకమైన వృత్తులతో ఉపాధి కలుగుతుందోనన్న అన్న విషయంపై సమీక్షించారు. వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్య క్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఏవో టి.జ్యోత్స్న, పశు వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్, వెలుగు సీసీలు బి.రామినాయుడు, సీహెచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

సీతంపేట రూరల్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులకు గురికాకుండా జీవించవొచ్చునని దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రతాప్ తెలిపారు. బుధవారం దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోగల నాయకమ్మగూడలో డ్రోన్ ద్వారా బీటీఐ(ఏఎస్) కెమికల్‌తో యాంటీలార్వా ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యానికి గురైతే సమీపంలో ఉన్న పీహెచ్‌సీని ఆశ్రయించి వైద్య సేవలు పొందాలని సూచించారు. గ్రామాల్లో మలేరియా, డెంగ్యు, చికన్‌గున్యా, డెంగ్యువంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్య క్రమంలో యాంటీలార్వ ఆపరేషన్‌లో మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు,పంచాయతీ సెక్రటరీలు,పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొంటాం

● జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీనివాసరావు

వీరఘట్టం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తామని జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం యు.వెంకంపేట, హుస్సేన్‌పురం గ్రామాల్లో పర్యటించారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆయన వెంట ఏవో సౌజన్య, సిబ్బంది ఉన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

విద్యార్థినుల మృతి బాధాకరం

● ఎస్‌ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషి ఘోస్



మాట్లాడుతున్న ఐషిఘోస్

కురుపాం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు అంజలి, కల్పన మృతి బాధాకరమని ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషి ఘోస్ పేర్కొన్నారు. బుధవారం గురుకులు బాలికల పాఠశాలను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామోహన్‌తో కలిసి సహాయ కార్యదర్శి ఘోస్, విద్యార్థి సంఘ నాయకులు,ప్రజా సంఘాల సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా వసతులు, సమస్యలు విద్యార్థినుల మృతికి కారణాలు ఉపాధ్యాయులు, విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు రాజ్యాంగం ఆవశ్యకత, ప్రజాస్వామ్యంలో యువత పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం మృతి చెందిన విద్యార్థినులు గ్రామాలకు వెళ్ళి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక.. ఫ్యూజ్‌వైర్లు వేలాడి

● కిమ్మిలో వీధి దీపాల కోసం ఏర్పాటుచేసిన బాక్స్ వద్ద పొంచిఉన్న ప్రమాదం ● చోద్యంచూస్తున్న అధికారులు

వీరఘట్టం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కిమ్మిలో ప్రధాన వీధిలో వీధి దీపాల కోసం ఏర్పాటుచేసిన ఫ్యూజ్‌బాక్స్‌వద్ద ప్రమాదం పొంచిఉంది. ఇక్కడ నాలుగేళ్ల కిందట పిల్లలకు సైతం అందేఎత్తులో దీన్ని ఏర్పాటుచేశారని గ్రామస్థులు వాపోతున్నారు. 400 మంది నివాసముండే ఈ గ్రామంలో జనావాసాల మధ్యలో వీధి దీపాలకు సంబంధించిన ఫ్యూజ్ బాక్స్ ఏర్పాటుచేశారు. తర్వాత నిర్వహణ లేకపోవడంతోపాటు ట్రాన్స్‌కో సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో బాక్స్ ఊడిపోవడం వల్ల వైర్లు వేలాడుతున్నాయి. ఇవి చేతికి అందేఎత్తులో ఉండడంతో ఆటుగా ఆడుకోవడానికి పిల్లలు వెళ్లేసమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని గ్రామంలోని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. వైర్లు గజిబిజీగా ఉండడంతో పాటు అందే ఎత్తులో ఉండడంతో గాలులు వీస్తే నేలకూలే ప్రమాదముందని పలువురు చెబుతున్నారు. వైర్లు సరిచేసే విషయంలో అధికారులు చోద్యం చూస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వేలాడుతున్న ఫ్యూజ్ వైర్లు సరిచేసి బాక్స్ ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కిమ్మిలో ఫ్యూజ్‌బాక్స్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లు

రాజ్యాంగ విలువలు పరిరక్షించాలి

● జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం



కురుపాం: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలు పరిరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ,స్వాతంత్ర్యసమరయోధుల వేషాధారణలు ప్రదర్శించారు. విద్యార్థులకు రాజ్యాంగ ఆవశ్యకతను వివరించారు. పలుచోట్ల విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించి చట్టసభల గురించి తెలియజేశారు.



వీరఘట్టం: తలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు



బెలగాం:కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..



గరుగుబిల్లి: అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



పాలకొండ: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



మక్కువ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో..

రైతుల సంక్షేమమే ధ్యేయం

● కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

కురుపాం,నవంబరు26(ఆంధ్రజ్యోతి):రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. కురుపాం పంచాయితీ శివ్వన్నపేటలో ఏవో ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో నిర్వహించారు. అలాగే స్థానిక శివన్నపేటలో సర్వ శిక్ష అభియాన్ భవనం పనులకు జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కద్రక కళావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆకాంక్షించారు.బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని వెలుగుఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను ప్రారంభించారు.కార్యక్రమంలో కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కళావతి, టీడీపీ నాయకులు వెంపటాపు భారతి, వెలుగు అధికారులు పాల్గొన్నారు. అలాగే మెండెంఖల్, తాడికొండ పీహెచ్‌సీలో ఆరోగ్యసిబ్బంది, ఆశవర్కర్ల సమావేశానికి భవనం మంజూరు చేయాలని వైద్యాధికారి బూదేష్ కోరారు. ఈ మేరకు బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీఇచ్చారు.



గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యాధికారి బూదేష్

నేడు బడ్జెట్ సమావేశం

కొమరాడ, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ 2025-26 సంవత్సర సవరణ బడ్జెట్, 2026-27 అంచనా బడ్జెట్‌కు సంబంధించి సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విచారణాధికారిని తప్పించాలి

సీతంపేట రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం విచారణ అధికారి నియమించిన ట్రైకార్ ఎండీ మణికుమార్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని దళిత ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ డి.గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీతంపేట డీడీ కార్యాలయఆవరణలో విచారణకు దళిత జేఏసీ నాయకులు హాజరయ్యారు. సీతంపేట ఐటీడీఏలో విచారణ కోసం దళిత ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హాజరైన నాయకులకు ముందస్తు సమాచారం లేకుండా విచారణను వాయిదా వేయడమంటే దళితులను అవమానించడమేనని ఒక ప్రకటనలో జేఏసీ నాయకులు రాకోటి రాంబాబు, కోత ధర్మారావు, టి.రమణ పేర్కొన్నారు. విచారణాధికారిగా వస్తున్న ట్రైకార్ ఎండీ ఐటీడీఏ ఏపీవో, డీడీలను ఏవిధంగా కాపాడాలనే వ్యూహరచనలో భాగంగానే నేడు జరగాల్సిన విచారణను వాయిదా వేయించారని ఆరోపించారు. తమకు విచారణాధికారిపై పూర్తిగా నమ్మకం లేదని, వేరే అధికారిని నియమించి విచారణ చేపట్టాలని డిమాం డ్‌చేశారు.

ఏజెన్సీలో వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టు వారోత్సవాలు పురస్కరించుకుని పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గిరిజన ప్రాంతంలోకి వచ్చిపోయే వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. కొత్తవ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వారిని ప్రశ్నిస్తున్నారు. ఎల్విన్‌పేట సీఐ హరి, సబ్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ తదితరులు ముమ్మరంగా వాహనాలు తనిఖీచేస్తున్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి

● రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం అధికారి జగన్మోహనరావు

సీతానగరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆరోగ్యసూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. బుధవారం సీతానగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై వైద్యసిబ్బందినిపై అవగాహన కల్పించారు. స్క్రీనింగ్ పూర్తి చేసిన వారి వివరాలు, , 4డీలు గుర్తింపు గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు యాప్‌లో ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. కిశోర బాలికల్లో రక్తహీనతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. ఆరోగ్యానికి పరిశుభ్రత, పోషకాహారం ప్రధానమని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత వల్ల రోగ నిరోధక శక్తి వృద్ధి చెంది వ్యాధులు దరిచేరవన్నారు. వైద్య, విద్యాశాఖలు సమన్వయంతో విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షించాలని కోరారు.కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్ గోపాల్ నాయుడు, సిబ్బందిలోకేశ్వరి, బంగారమ్మ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

పాచిపెంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మంచాల లక్ష్మణరావు (49) గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం విధుల్లో ఉంటుండగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయి మృతి చెందినట్లు ఎంపీడీవో బీవీజే పాత్రో తెలిపారు. పెద్దవలసతో దహనసంస్కారాల్లో ఎంపీడీవోతోపాటు ఏపీవో సత్యనారాయణ పాల్గొని సంతాపం తెలియజేశారు. లక్ష్మణరావుకు భార్య తవిటమ్మ, కుమార్తె అంజలి ఉన్నారు.

ఇలానే వదిలేస్తారా..?

(5వ పేజీ తరువాయి)

ఉన్న ఏడు ట్రైబల్ ప్రాజెక్ట్ మానటరింగ్ యూనిట్ మండలాల్లో ఉన్న 68వీడీవీకేల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వాటిల్లో ఉన్న యంత్ర పరికరాలు చిన్నపాటి మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో లక్షల విలువచేసే పరికరాలు మూలకు చేరుతున్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావాలంటే విజయవాడ నుంచి టెక్నీషియన్ రావాల్సి ఉందని తెలిసింది.

● వీడీవీకేలను వెలుగు డీపీఎం స్థాయి అధికారి సందర్శించకపోవడం, క్షేత్ర స్థాయిలో ఉన్న వెలుగు సీసీలతో సమన్వయం చేసుకోకపోవడంతో కేంద్రాల నిర్వహణ గాడి తప్పిందని చెప్పొచ్చు. వీడీవీకేల పనితీరుపై సమీక్షల నిర్వహించిన సమయాల్లో లెక్కలు చెప్పడం వెలుగు సిబ్బందికి పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో మాత్రం వీటి పరిస్థితి భిన్నంగా ఉంది.

● వీడీవీకేల్లో గిరిజన మహిళలు తయారుచేసిన అటవీ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ మార్కెటింగ్ సదుపాయం లేదు. పెద్ద మొత్తంలో ఏవిధంగా విక్రయాలు చేయాలనే దానిపై ఎస్‌హెచ్‌జీలకు అవగాహన లేకుండా పోయింది. వెలుగు సిబ్బంది కూడా ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

గుర్తిస్తారా.. ఆదుకుంటారా?

(5వ పేజీ తరువాయి)

కొంతమంది దివ్యాంగులుగా మారుతున్నారు. పరిస్థితి దారుణంగా ఉన్నా వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం జిల్లాలో రోగుల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. ఈ వ్యాధిగ్రస్థులకు అవసరమైన వైద్యం, భృతి అందించాల్సి ఉంది. ప్రత్యేక సదుపాయాలు కల్పించి.. పునరావాస కేంద్రాలకు తరలించాలని బాధితులు కోరుతున్నారు. దీనిపై జిల్లా లెప్రసీ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా.. 'జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు ఈ నెలాఖరు వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి బాధితులను గుర్తిస్తున్నారు. జిల్లాల్లో 132 మంది వ్యాధిగ్రస్థులు ఉన్నారు. వీరికి ట్రీట్‌మెంట్ కొనసాగుతుంది. అవసరమైన వారికి సర్జరీలు చేయించి డిశ్చార్జి సమయంలో మందులతోపాటు రూ.12 వేలు ఇస్తున్నాం. వ్యాధి లక్షణాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాం.' అని తెలిపారు.

గిరిజనుల జీవనోపాధికి చర్యలు

(5వ పేజీ తరువాయి)

ఆరా తీశారు. పీఎం జన్‌మన్ పథకంలో 56 ఇళ్లు మంజూరవగా.. 35 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. బిల్లులు అందితే డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేస్తామని గిరిజనులు తెలిపారు. స్వయం కృషితో ఆర్థిక అభివృద్ధి చెందొచ్చని, ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. అనంతరం ఆమె బోడగూడ మోడల్ అంగన్‌వాడీ కేంద్రం, బత్తిలి పీహెచ్‌సీని సైతం పరిశీలించారు. తమ గ్రామానికి పాఠశాల, సచివాలయం పనులు పూర్తి చేయాలని పలువురు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఈ పర్యటనలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో అధిక లాభాలు

గరుగుబిల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా రైతులు బహుళ పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమ సుందర్ సూచించారు. బుదవారం మండలంలోని సంతోషపురం, గరుగుబిల్లిల్లో రబీ ప్రీసాయింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీలో బహుళ పంటల విధానంతో ఏడాది పాటు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులు 50సెంట్లులో ప్రకృతి వ్యవసాయానికి ముందుకు రావాలన్నారు. అనంతరం రైతులకు పలు రకాల విత్తనాలతో కూడిన విత్తన కిట్లను రైతులకు అందించారు.కార్యక్రమంలో ఎన్ఏఏ జి.అన్నపూర్ణ, తిరుపతిరావు, పోలినాయుడు, వెంకటనాయుడు పాల్గొన్నారు.



సంతోషపురంలో అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న హేమసుందర్